క్లుప్తంగా

న్యాయం చేయండి



పట్టా పత్రాలు చూపుతున్న రజకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలంటూ రామునిపట్ల గ్రామానికి చెందిన రజకులు ఆవేదన వ్యక్తం చేశారు. రజక సంఘం సభ్యులు శుక్రవారం మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబరు 240లో ప్రభుత్వం 2005లో కేటాయించిన ఎకరం భూమిలో దోబీఘాట్ నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇటీవల గ్రామానికి చెందిన వాసరి ఐలయ్య ఆ అక్రమంగా గొర్రెల షెడ్డు నిర్మిస్తున్నాడని, ఈ విషయమై తహసీల్దార్, సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి తమ భూమికి హద్దులు చూపి అప్పగించాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని, మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బడిబాట'పై సమావేశాలు

మిరుదొడ్డి(దుబ్బాక): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో శుక్రవారం అధికారులు బడిబాట కార్యక్రమంపై వేర్వేరుగా కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారుల భాగస్వామ్యంపై చర్చించారు. ఆయా కార్యక్రమాలల్లో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఎంఈఓ ప్రవీణ్ బాబు, ఏపీఎం దాకయ్య, హెడ్ కానిస్టేబుల్ ప్రమోద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈఓ అంజాగౌడ్, భూంపల్లి ఎస్ఐ హరీశ్, ఎంపీడీఓ బాలాజీ, ఏపీఎం కృష్ణారెడ్డి, సీసీ పరశురాములు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: ఎస్ఐ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ అపూర్వరెడ్డి, వ్యవసాయ అధికారి నరేశ్

సిద్దిపేటరూరల్/మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకటౌన్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని రాఘవాపూర్, పుల్లూరు, బండచెర్లపల్లి గ్రామాల్లోని విత్తన విక్రయ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి నరేశ్‌తో కలిసి ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాల కొరత లేదని, అలాంటి వదంతులు నమ్మవద్దన్నారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని దుకాణాలలో మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, దుబ్బాకలో ఎస్ఐ గంగరాజు, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భూంపల్లి ఎస్ఐ హరీశ్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సిద్దిపేట కమాన్: బాలిక అదృశ్యమైన ఘటనపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ వాసుదేవరావు కథనం ప్రకారం.. గురువారం రాత్రి భారత్ నగర్‌లో ఓ బాలిక నిత్యావసర సరుకుల కోసమని బైటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలిక తల్లి బంధువుల ఇళ్లవద్ద, చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బడికేదీ.. భద్రత?

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు కరువు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు
- ఆక్రమణకు గురవుతున్న స్థలాలు



ప్రహరీ లేని గురువన్నపేట ఉన్నత పాఠశాల

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించింది. కానీ కొన్ని చోట్ల పాఠశాలలకు కనీస వసతులు కరువయ్యాయి.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. ప్రభుత్వం పాఠశాలలో మౌలికవసతులు కల్పించడానికి కృషిచేస్తున్నా ప్రహరీల నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలలు రహదారి పక్కనే ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకోస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

మండలంలో 11 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, నాలుగు ఉన్నత, ఒక కేజీబీవీ పాఠశాల ఉంది. అందులో సుమారు 1,150 మంది విద్యను అభ్యసిస్తున్నారు. నాలుగు పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోగా రెండు పాఠశాలలకు అసంపూర్తిగా ఉంది. గౌరయపల్లి, గురువన్నపేట, రాంసాగర్, అయినాపూర్, తపాస్‌పల్లి, మర్రిముచ్చాల ఉన్నత పాఠశాలలకు ప్రహరీలు లేవు. దీంతో ముఖ్యంగా విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కొమురవెల్లిలోని కేజీబీవీ పాఠశాలకు ప్రహరీ లేదు



ప్రధాన రహదారిపై ఉన్నా రక్షణ లేని మర్రిముచ్చాల ఉన్నత పాఠశాల

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలు

కొన్నిపాఠశాలలు పొలాలు, రహదారుల పక్కనే ఉన్నాయి. కాని వారికి రక్షణ గోడలు లేకపోవడంతో పాఠశాల ఆవరణలో కుక్కలు, కోతులు, పందులు సంచరిస్తున్నాయి. మరి కొన్ని పాఠశాలలు మందు బాబులకు అడ్డాగా మారాయి. మరికొన్ని చోట్ల పాఠశాల స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. రక్షణ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో భయమేస్తోంది..



కొమురవెల్లి కేజీబీవీ పాఠశాల ఊరిబైట ఉంది. పాఠశాలకు ప్రహరీ లేదు. చుట్టూ పొలాలు, అటవీ ప్రాంతం ఉండడంతో ఎక్కడ నుంచి పాములు, విషపురుగులు వస్తాయో.. ఎవరి వల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. రాత్రయితే చాలు.. భయంతో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి.

– వైష్ణవి, కేజీబీవీ విద్యార్థిని, కొమురవెల్లి

ప్రతిపాదనలు పంపించాం



కొమురవెల్లి మండలంలో ప్రహరీలు లేని పాఠశాలలను గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేడుతాం. రక్షణ గోడల నిర్మాణంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– రమేశ్, ఎంఈఓ కొమురవెల్లి

కల్యాణం.. కమనీయం



కుకునూరుపల్లిలో ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా పండితులు శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాంపూర్ కోటిలింగాల ఆలయ పీఠాధిపతి మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో కల్యాణోత్సవ క్రతువు నిర్వహించారు. మహిళలు దేవతామూర్తులకు ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాధవానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ దైవ స్వరూపాన్ని మనస్సులో నింపుకుంటే ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తదితరులు కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. 3వ తేదీ నుంచి 6 వరకు వరుసగా రాంపల్లి, ఖమ్మంపల్లి, మర్పడ్గ, గిరాయిపల్లిలోను, అలాగే 9 నుంచి 13 వరకు సిర్సనగండ్ల, దమ్మక్కపల్లి, కొండపాక. జప్తినాచారం, దర్గా, 16 నుంచి 20 వరకు బందారం, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, విశ్వనాథపల్లి, తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట గ్రామాల్లో సదస్సులు ఉంటాయని శుక్రవారం ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కారు, ట్రాక్టర్ ఢీ

దుబ్బాకరూరల్: కారు, ట్రాక్టర్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం చౌరస్తా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం ప్రకారం.. నగరం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ రాళ్లలోడ్‌తో రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ వైపు వెళ్తుండగా మెదక్ వైపు వెళ్తున్న ఓ కారు ఢీ కొట్టింది. దీంతో కారు పాక్షికంగా దెబ్బతిన్నది. ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎస్ఐ తెలిపారు.

బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన బీడ కనకయ్య లావణ్య దంపతుల కుమారుడు నికాస్ రొటోవేటర్‌లో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వారి వెంట లక్ష్మీలింగం, ఎండీ అహ్మద్, సత్యనారాయణ, మల్లేశం, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.



బాలుడి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివరామన్

కొండపాక(గజ్వేల్): పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శివరామన్ సూచించారు. కుకునూరుపల్లిలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం రైతులకు వికసిత అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వానాకాలంలో ఏయే పంటలు సాగుచేసుకోవాలో రైతులకు వివరించారు. సాగు చేసుకునే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కూరగాయలు, ఆయిల్‌పామ్, పండ్ల తోటల సాగుపై మొగ్గుచూపాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీకాంత్, ఏఓ గోవిందరాజు, ఏఈఓ రమ్యశ్రీ, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వానాకాలంలో రైతులు పంటలు సాగుచేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుంటే లోపాలు తెలుసుకోవచ్చని డాక్టర్ రమేశ్‌నాయక్, శాస్త్రవేత్త నారం, మట్టి నైపుణ్య శాస్త్రవేత్త గిరిజవాణి చెప్పారు. మండలంలోని తిగుల్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఏఓ వసంతరావు, ఎఫ్‌పీఓ భార్గవి, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు. అలాగే జగదేవ్‌పూర్‌లో పీస్ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య మాట్లాడారు. ప్రతి ఒకరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. సిబ్బంది అరుణ, శోభ, నాగలక్ష్మి, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): మాట్లాడుతున్న శివరామన్

పాఠశాలల బలోపేతం అందరి బాధ్యత

జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మిగతా సదుపాయాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ సత్తయ్య



మిరుదొడ్డి(దుబ్బాక): బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ ప్రవీణ్‌బాబు, ఉపాధ్యాయులు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో ఇంటింటికీ తిరుగుతున్న ఉపాధ్యాయులు



బెజ్జంకిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మహిళల రక్షణే ప్రథమ బాధ్యత

- సైబర్ నేరాలతో అప్రమత్తతం
- వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు



మాట్లాడుతున్న సీఐ వాసుదేవరావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలు, చిన్నారుల రక్షణే తమ ప్రథమ బాధ్యతగా ముందుకు వెళుతున్నామని, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నూతన ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐతో పాటు టూటౌన్ ఎస్ఐ రాజేశం మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. వ్యక్తిగత సమాచారం ఇతరులకు అందించొద్దని, ఏదైనా నేరం జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. డ్రగ్స్ రహిత జిల్లాగా సిద్దిపేటను మార్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా 100, 112, 1098, షీ టీమ్ వాట్సాఫ్ నంబర్ 87126 67343, మహిళా పోలీస్ స్టేషన్ నంబర్ 8712667435కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక వసూళ్లను నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని అంగడిలో టెండర్‌దారులు మున్సిపల్ నిర్ణయించిన ధరల కంటే ఎక్కువగా వసూళ్లకు పాల్పడుతున్నారని నిరసిస్తూ వివిధ పార్టీల నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెండర్‌దారులు రైతులు, చిరు వ్యాపారుల నుంచి అధికంగా రుసుం వసూలు చేస్తూ దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచారని, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడం వల్లనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంగడి ద్వారా మున్సిపల్‌కు వచ్చే ఆదాయం తగ్గడానికి కమిషనరే కారణమని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, ఇంద్రాల సారయ్య, శ్యాంసుందర్ గౌడ్, వికాస్ యాదవ్, అరవింద్, సీపీఎం నాయకుడు శివరాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. 17వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెట్టి కమీషన్ల కోసం పాలన సాగించిందన్నారు. సాహసోపేత నిర్ణయాలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతున్నారని, అయితే కేటీఆర్, హరీశ్‌రావు తమ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గజ్వేల్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మజీద్ కమిటీ చైర్మన్ మతిన్, నాయకులు రాజు, రాములుగౌడ్, సాజిద్‌బేగ్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

కొండపాక(గజ్వేల్): పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన నరేశ్‌కు మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం అందజేశారు. నాయకులు సుదర్శన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలను అందించాలి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువవికాసం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా రుణాలందించాలన్నారు. గ్రామస్థాయి నాయకుడి నుంచి ముఖ్యమంత్రి వరకు రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలతో కాంగ్రెస్ పాలన సాగుతోందని మండిపడ్డారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంత వరకు ఒక్క కొత్త ప్రాజెక్టును కూడా చేపట్టలేదని వాపోయారు. పేదల నడ్డి విరుస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు దేవీ రవీందర్, నవాజ్‌మీరా, జకియొద్దీన్, కరుణాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రవీందర్, కనకయ్య, నర్సింగరావు, రమేశ్‌గౌడ్, అహ్మద్, నరేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు పైసా నిధుల్లేవ్..

- జిల్లాను పట్టించుకోని ఇన్‌చార్జి మంత్రి
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాదిన్నర గడుస్తున్నా ఎమ్మెల్యేలకు నయాపైసా నిధులివ్వలేదని, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ఒక్క శిలాఫలకం కూడా వేయలేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన 150 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అలవికాని హామీలిచ్చి బొక్కబోర్లా పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఎద్దేవా చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తుగా కొట్టుకపోవడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అంగన్‌వాడీ, హాస్టల్స్, పాఠశాలలు, వైద్యశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, రైతులు వివిధ సమస్యలతో కన్నీరు పెడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–2006 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఒక్క చోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, రంగనాథ్, హేమలత, విద్యార్థులు మహేశ్, కనకరాజు, శ్రీధర్, లింగం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు